## ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఉండాల్సిందే

# మూడు గంటల కరెంటిచ్చి ఎవరిని ముంచుతరు

• కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై రైతన్నల మండిపాటు • ఎవుసం కష్టాలు తెసిన సీఎం కేసీఆర్‌కే మా మద్దతు అంటున్న రైతులు



"10హెచ్‌పీ మోటర్‌తో వ్యవసాయానికి 3గంటల కరెంట్ సరిపోతుందున్న కాంగ్రెస్ నాయకులకు వచ్చే ఎన్నికలో తగిన గుణపాఠం చెబుతామని రైతులు హెచ్చరిస్తున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వ్యవసాయంపై అవగాహన లేక ఇలాంటి వ్యాఖ్యలు చేశారని మండి పడుతున్నారు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ అందిస్తున్న 24గంటల కరెంట్ వల్ల సంతోషంగా సాగు చేసుకుంటున్నామని పేర్కొంటున్నారు. వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఉండాల్సిందే అంటున్నారు. వచ్చే ఎన్నికలో 3గంటలు అంటున్న కాంగ్రెస్ నాయకులకు బుద్ధి చెప్పి ప్రజల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ మద్దతు ఇస్తామని పేర్కొంటున్నారు."



### కాంగ్రెసోళ్లకు రైతు గోస తెలియదు

వ్యవసాయానికి 3గంటల కరెంట్ ఎట్ల సరిపోతదో రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలి. ప్రస్తుతం సరఫరా అవుతున్న 24గంటల కరెంట్‌తో రైతులు సంతోషంగా ఉన్నరు. లేని పోని మాటలు చెప్పి రైతులను నిండి ముంచేందుకే కొందరు వస్తున్నరు. రేవంత్‌రెడ్డి మాటలు నమ్మితే రైతులు మల్లా రాత్రి కరెంట్ ఎక్కడవాయరో అంటూ పోయి పాము, తేలు కాట్లకు గురై అక్కడే సచ్చినా సస్తం. 10హెచ్‌పీ మోటార్లు పెడితే ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటయా. కాంగ్రెసోళ్లకు రైతుల గోస తెలియదు వారి మాటలు పట్టించుకోవద్దు. రైతులందరం సీఎం కేసీఆర్ వెంటే ఉంటాం.

**– మాలోతు సైదానాయక్, కాల్వపల్లితండా, మఠంపల్లి**

### కాంగ్రెసొస్తే వ్యవసాయం బంద్ పెట్టాల్సిందే

ప్రస్తుతం బీఆర్ఎస్ పాలనలో 24గంటల కరెంట్‌తో ఎలాంటి సమస్యలు లేవు. కాంగ్రెస్ నాయకులు చెబుతున్నట్లు 3గంటల కరెంటిస్తే సగం మడి తడవదు. దీంతో రైతులు వ్యవసాయం బంద్ చేసుకుని పట్టణంలో కూలీ పనులకు పోవాల్సి వస్తది. గతంలో కరెంట్ కోసం రాత్రింబవళ్లు పొలాల వద్ద కాపుకాసిన రోజులు మరచిపోలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు ఇబ్బందులు తొలగి సంతోషంగా వ్యవసాయం చేసుకుంటున్నం. 3గంటల కరెంట్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ మాకొద్దు. రైతు సంక్షేమానికి పాటుపడే ప్రభుత్వానికే మద్దతు ఇస్తాం.



**– కాకుమాను కోటిరెడ్డి, గుడిబండ, కోదాడ రూరల్**

### కాంగ్రెసోళ్లకు సాగుపై అవగాహన లేదు



వ్యవసాయం, రైతుల ఇబ్బందులు, కష్టాలపై కాంగ్రెసోళ్లకు సరైన అవగాహన లేదు. ఉంటే 3గంటల కరెంట్ సరిపోతుందని ఎలా అంటారు. గతంలో కాంగ్రెస్ హయంలో ఉదయం, రాత్రి వేళల్లో కరెంటు కోసం పొలాల వద్ద పడిగాపులు కాసేవాళ్లం. రాత్రివేళల్లో పొలాల వద్దకు వెళ్లిన వారిలో పురుగు, పుట్రా కుట్టి చనిపోయిన వారెందరో ఉన్నరు. రైతు బాధలు తెలిసిన సీఎం కేసీఆర్ 24గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నరు. రైతు సంక్షేమానికి పాటు పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికే మా మద్దతు.

**– పింగళి శ్రీనివాస్‌రెడ్డి, అడ్లూరు, కోదాడ రూరల్**

### 10 హెచ్‌పీ మోటర్లతో బోర్లు ఎండిపోతయ్

10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకుంటే బోర్లల్లో నీళ్లన్నీ అడుగంటుతయ్. దాంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. ఒక 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ కింద 3 హెచీపీ మోటర్లు 30, 5 హెచీపీ మోటర్లు అయితే 18వరకు నడుస్తయి. 10 హెచీపీ మోటర్లయితే కేవలం 9 మాత్రమే నడుస్తాయి. అంటే మిగతా 3 హెచీపీ మోటర్లు వాడే 18మందికి సరిపడా విద్యుత్ ఇవ్వాలంటే మరో 150కేవీ ట్రాన్స్‌ఫార్మర్ అదనంగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దాంతో పాటు అందరూ ఒకే సారి 10హెచీపీ మోటర్లు ఆన్‌చేస్తే గ్రిడ్ దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఒక వేళ ఓల్టేజీ సరిపోక మోటరు కాలిపోతే వైడింగ్ చేయించేందుకు రైతుపై అధిక భారం పడుతుంది.



**– సురేశ్, మోటరు వైడింగ్ షాపు యజమాని, మునుగోడు**

### కాంగ్రెస్‌ది రైతులను ఆగం చేసే కుట్ర



తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వ్యవసాయానికి నిరంతర విద్యుత్ అందిస్తున్నది. అంతేకాకుండా రైతుబంధు, రైతుబీమా ఇస్తూ వారి శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నది. ఈ తరుణంలో కాంగ్రెస్ నాయకులు వ్యవసాయానికి 3 గంటల కరెంటు చాలని, రైతులు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలని చెప్పడం ఏ మాత్రం సరి కాదు. రాజకీయంగా బీఆర్ఎస్‌ను ఎదుర్కోలేక వేస్తున్న నాటకం. రైతులను ఆగం చేయాలన్న కుట్ర. కాంగ్రెస్ నాయకులు ఎన్ని ఎత్తులు వేసినా రైతులంతా సీఎం కేసీఆర్ వెంటే ఉంటారు. రైతులను రాజు చేస్తున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే.

**– కంకల కిష్టయ్య, రైతు, చందుపట్ల, భువనగిరి కలెక్టరేట్**

### 3గంటల కరెంట్‌కు పంట పండదు

వ్యవసాయానికి 3గంటల కరెంట్ ఏ మూలకు సరిపోదు. ఒక మడి కూడా తడవదు. అప్పట్లో కరెంట్ సరిగా లేక చీకట్లో రైతులందరం కలిసి బ్యాటరీ లైట్‌తో భయం భయంగా పొలాలకు పోయేటోళ్లం. ప్రస్తుతం ఎవరూ బాయికాడ పడుకోవట్లేదు. సీఎం కేసీఆర్ సార్ వ్యవసాయానికి 24గంటల కరెంట్ ఇవ్వడంతో రందీ లేకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు పొలాలకు నీళ్లు పెట్టు కుంటున్నం. తెలంగాణ వచ్చినంకనే మా బతుకులు బాగుపడ్డయ్. కరెంట్ గోస తీరింది. బావుల కాడ పడుకునే పరిస్థితి రాకూడదు.

**– వెన్న నర్సిరెడ్డి, లక్కవరం(గ్రా), హుజూర్‌నగర్(మం)**



### గతంలో కరెంట్ తిప్పలు అన్నీఇన్నీ కావు

గత ప్రభుత్వాల హయాంలో కరెంట్ సక్రమంగా రాక తీవ్ర ఇబ్బందులు పడ్డం. కరెంట్ కోసం బావుల వద్ద రాత్రింబవళ్లు పడిగాపులు కాసి వ్యవసాయాన్ని సాగు చేసినం. అయినా కరెంట్ సక్రమంగా రాక వేసిన పంట నోటి దగ్గరకు వచ్చేసరికి ఎండి పోయేది. లో ఓల్టేజీ సమస్యతో ట్రాన్స్‌ఫార్మర్లు ఎప్పుడు పడితే అప్పుడు కాలిపోయేవి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక రైతులకు 24గంటల నాణ్యమైన కరెంట్ ఇస్తున్నరు. దాంతో పంటలు పుష్కలంగా పండించుకుంటున్నం. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నందుకు సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటం.



**– స్వామి, రైతు, మోతె**

### మూడు గంటలన్నోళ్లకు.. ఓటుతోనే బుద్ధి చెప్తాం

కరెంటు కోసం రేయంబవళ్లు పడిన కష్టాలు మరచిపోలేదు. వాటి కోసం ఎందరో రైతులు తమ ప్రాణాలను పోగొట్టుకున్నారు. తిరిగి 3గంటల కరెంట్ అంటూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ వద్దు.. వారు ఇస్తానన్న 3గంటల కరెంటు వద్దు. ప్రస్తుతం సీఎం కేసీఆర్ అందిస్తున్న 24గంటల కరెంటు సరఫరాతో సంతోషంగా ఉన్నాం. రైతులు పండుగలా వ్యవసాయం సాగు చేస్తున్నరు. ఏ మూలకు సరిపోని 3గంటల కరెంట్‌తో ముందుకొస్తున్న కాంగ్రెస్ నాయకులకు ఓటుతో తగిన బుద్ధి చెపుతాం. రైతు సంక్షేమానికి పాటు పడుతున్న ప్రభుత్వానికి అండగా నిలబడతాం.



**– ఎస్‌కె.నభీ, కూచిపూడి, కోదాడ రూరల్**